## ఈ వారం కథ

"ఒసేయ్! నీయమ్మ బయటికిరావే......" అనే కేక వినపడేసరికి నేను కళ్ళు తెరిచాను. నిద్రమత్తు నన్నింకా పూర్తిగా వదల్లేదు.

"తలుపు తెరవ్వే నీయమ్మ...." ఇంకా పెద్దగా కేకలు వినిపిస్తుంటే రూములో నుండి కళ్ళు నులుముకుంటూ బయటకు వచ్చాను. ఎదురుగా ఉన్న రేకుల షెడ్డు తలుపుమీద కొడుతూ అరుస్తున్నాడు వెంకట్రావు. నాకు ఎంతో ఆశ్చర్యమనిపించింది. అతడు తన తల్లిని ఎందుకలా తిడుతున్నాడో నాకు అర్థం కాలేదు. ఆరేకుల షెడ్డులో వెంకట్రావు తల్లి నారాయణమ్మ ఉంటుంది. ఆవిడ చుట్టుప్రక్కల ఆఫీసర్ల ఇళ్ళల్లో పాచిపనులు చేసుకొని బతుకుతుంది. ఆమె ఉంటున్న రేకుల షెడ్డుకు వందరూపాయల వరకు అద్దె చెల్లించాలి. వెంకట్రావు బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి నెలకు ఘూదువేల రూపాయలు జీతం వస్తుంది. పెళ్ళయింది, ఇద్దరు మగపిల్లలు. స్వంత ఇల్లుకూడా వుంది. అయినా వెంకట్రావు తల్లిని పోషించడంలేదు.

అప్పడే నిద్రలేచిందేమో నారాయణమ్మ తలుపుతెరిచి ఎదురుగా వున్న కొడుకును చూసింది."ఏమిటి నీవు చేస్తున్నపని! నేను ఊళ్ళో తలెత్తుకు తిరగాలా? లేదా?". సూటిగా ఆవిడవైపు చూస్తూ ప్రశ్నించాడు . వెంకట్రావు. ఆమాటలు వింటే ఒక కొడుకు, తల్లితో మాట్లాడుతున్నాడని ఎవరూ అనుకోరు. తన భార్యమీద కోపం వచ్చినప్పుడు ప్రతి భర్తా ఎలా మాట్లాడతాడో అలా ఉన్నాయి వెంకట్రావు మాటలు.

నారాయణమ్మకు విషయం అర్థమయి వుంటుంది. "అంతకాని పని నేనేం చేయటం లేదు" అన్నది.

"అదంతాకాదు నువ్వు ఇంటికిరా? నేను, నీకు కూడు పెడతా....".

"ఇన్నాళ్ళూ ఎందుకు పెట్టలేదురా.... ఇప్పడే నీకు తల్లి గుర్తొచ్చిందా?......నేను చచ్చినా రాను. నువ్వూ, నీభార్యా అన్న మాటలు ఇప్పటికీ నా చెవుల్లో వినిపిస్తూనే వున్నాయి." చెప్పింది. నారాయణమ్మ.

"అయితే రావన్నమాట. నీ యిష్టం వచ్చినట్టే చేస్తావా?" ఉగ్రంగా అడిగాడు అతడు.

"అవును. నువ్వింక వెళ్ళొచ్చు" అని లోపలికి వెళ్ళబోయిందామె. వెంటనే చప్పన ఆమె జుట్టుపట్టుకొని చరచరా బయటకు ఈడుస్తూ "ఏమిటే నీయమ్మ తెగరెచ్చిపోతున్నావ్? నేను బతికి ఉన్నాననుకున్నావా? చచ్చాననుకున్నావా?. ...."అంటూ బజారులోకి నెట్టాడు. ఆ విసురుకి రోజుకు ఒక్కపూట మాత్రమే కడుపునింపుకొని, రెండుపూట్లా ఆకలిని చంపుకునే ఆమె రోడ్డుమీదకు వచ్చిపడింది.

వెంకట్రావు ఆమెను కాళ్ళతో బలంగా తంతూ "ఇప్పడు చెప్పవే నేను చెప్పినట్టు వింటావా! లేదా!" అంటున్నాడు.

అప్పటికే పక్క ఇళ్ళ వారంతా గుమిగూడి ఆ దృశ్యాన్ని చూడసాగారు. నేనిక చూస్తూ ఉండలేకపోయాను. ఆమెను ఎందుకు కొడుతున్నాడా అనుకుని "ఏమండీ!....ఏమండీ!... కాస్త ఆగండి అని అతడిని క్షణాల్లో బలవంతంగా పట్టుకుని ఆమె నుండి పక్కకి లాగాను. కొడుకు దెబ్బలకు నారాయణమ్మ శరీరమంతా వణుకుతోంది. ఆయాసంతో ఆవిడ పెద్దగా రొప్పతోంది.

"ఎందుకండీ పాపం! ఆముసలావిడను కొడతారు?" అడిగాను వెంకట్రావును గట్టిగా పట్టుకొని.


"ఛీ... దీనమ్మ... ఇది ముసల్ది అనుకుంటున్నారా..... కాదండి.....కుర్రది, వగలమారిది ఆవిడవైపు చెయ్యి చూపిస్తూ చెప్పాడు అతడు.

"ఎందుకండీ ఆమెను తిడతారు. ఇంతకీ ఏంచేసిందో చెప్పండి" అని నేను అనేసరికి "ఎలా చెప్పాలండి! చెప్పాలంటే నాకే సిగ్గుగా వుంది." అని ఒక్కక్షణం ఆగి "ఇది ఈ వయస్సులో పెళ్ళి చేసుకుంటుందంటండి" అన్నాడు.

అప్పటిదాకా గోలగా వున్న గుంపంతా అతడు చెప్పిందాంతో నిశ్శబ్దం అయిపోయింది. నాకు ఆ వయస్సులో ఆమె పెళ్ళి చేసుకుంటుందని వినగానే ఆశ్చర్యమేసింది. కొందరు ఆడవాళ్ళు బుగ్గలు నొక్కుకుంటూ "అందుకే దీన్ని కలికాలం అన్నారు. రోజురోజుకూ పాపం పెరిగిపోతుంది. ముసల్ది ఎంతకు తెగించింది." అనుకోసాగారు.

జనం అనుకునే మాటలు వినగానే వెంకట్రావుకు ఇంకాస్త బలం వచ్చినట్టయింది. దానితో "మీరే చెప్పండి. ఇది ఈ వయస్సులో పెళ్ళి చేసుకోవటం సరైందేనా. చెట్టంత ఎదిగిన కొడుకుని నేనున్నాను. దీనికి ఇద్దరు మనవళ్ళు వున్నారు. అయినా సిగ్గులేకుండా పెళ్ళి చేసుకుంటుందంటే దీన్నేం చేయాలి?" అని అందరివైపు ఒక్కసారి పరికించి చూసాడు. తనకు అనుకూలంగా, సానుభూతిగా అందరి ముఖాల్లో భావాలు వున్నట్టు కనిపించగానే చెప్పసాగాడు. "దీనికి సిగ్గు లేకపోయిందనుకోండి ఆ మాధవయ్య కన్నాలేదా? మిలట్రీలో పని చేశానని గొప్పగా చెబుతాడు. ఇలాంటివి చేయమనేనా మిలట్రీలో ట్రైనింగ్ ఇచ్చింది".

అందరూ నారాయణమ్మను రాక్షసిలా చూడసాగారు. వెంకట్రావు చెప్పింది విన్నతర్వాత నాకు కొంత ఆశ్చర్యం కలిగింది. మాధవరావుగారు నాకు తెలుసు. ఆయన మా బజారులోని చివరి ఇంట్లో వుంటున్నారు. వయస్సు అరవై సంవత్సరాలు వుంటాయి. ఆయన తన జీవితకాలమంతా




మిలట్రీలోనే పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన అసలు పెళ్ళి చేసుకోలేదు.

నారాయణమ్మ వణుకు ఇంకాతగ్గలేదు. ఆవిడ అలావణుకుతూనే "ఒరేయ్! నువ్వు అసలు కొడుకువేరా.... మీనాన్న నీ చిన్నప్పడే చచ్చిపోతే నా సర్వస్వంగా నిన్నే పెంచుకున్నాను. నన్ను మళ్ళీ పెళ్ళి చేసుకోమన్నారు. కానీ, ఆవచ్చేవాడు నిన్ను సరిగా ఆదరించడని నేను చేసుకోలేదు. ఆ ఇంట్లో, ఈ ఇంట్లో ప్రొద్దున, రాత్రి పాచిపన్లు చేస్తూ, పగలంతా పొలం పనులకు వెళ్తూ, నిన్ను నా రెక్కల కష్టంతో చదివించాను. ఆ దేవుడి దయవల్ల నీకు బ్యాంకులో పని వచ్చింది. తర్వాత పెళ్ళి చేసుకున్నావు. నాకా వయసు మీద పడగానే ఏ పనులకూ వెళ్ళలేక పోతున్నాను. కోడలు, నువ్వు కలిసి నన్ను ఎన్నెన్ని అవమానాలకు గురిచేశారురా..... అన్నం మీవరకే వండుకునేవారు. క్షణక్షణం సూటిపోటీ మాటలని చిత్రహింసలు పెట్టారు. నామనవళ్ళని ఎత్తుకోబోతే ఏయ్! నీపాడు చేతులతో వాళ్ళను ముట్టుకోవద్దు అనే వాడివి కదరా! ఈ పాడుచేతులే నిన్ను ఇంతవాడిని చేశాయని మరచిపోయావా?.... ఆమె చెబుతోంది.

గుంపులోని వారంతా శ్రద్ధగా వినసాగారు.

"...ఏరోజన్నా ఓముద్ద అన్నం పొరపాటుగా పెడితే ... 'తేరగా కూర్చుని తింటానికి సిగ్గెక్కడలేదో....' అని నీభార్య అంటుంటే తిన్న అన్నంకూడా పైకి ఎగదన్నుకుని వచ్చేది. మీ బాధపడలేక నేను ఇంట్లో నుండి వచ్చి, ఐదేళ్ళుగా కష్టం మీద పాచిపనులు చేసుకుంటూ ఎలాగోలా బ్రతుకుతూ వున్నాను. ఈ ఐదేళ్ళలో నువ్వు ఎప్పడన్నా వచ్చి అమ్మా! ఎలా ఉన్నావు? అనడిగావురా. 'నేనే ఒకసారి నీ దగ్గరికి వచ్చి బాబు! నాకు అర్ధరాత్రులప్పడు నిద్రలో గుండె నొప్పి వస్తోందిరా. ఇవాళ డాక్టరు దగ్గరికి వెళ్తే మాత్రలు రాసిచ్చారు. అవి తెచ్చుకోవడానికి డబ్బులు లేవు. అవి వాడకపోతే చాలా ప్రమాదం అంటరా. ఈ మాత్రల కన్నా డబ్బులివ్వరా' అంటే, నువ్వు 'నాదగ్గర పైసాలేదు. మొన్ననే కలర్ టి.వి. తీసుకున్నా. స్టార్ కనెక్షన్‌కే నెలకు కొంత ఖర్చవుతోంది. ఇంకెప్పడు రాకు' అన్నప్పడు నాగుండె ఎంతగా రగిలిపోయిందో నీకు తెలుసా?... అప్పడు రోడ్డుమీద కనపడిన ఎవరెవరినో అడగ్గా వచ్చిన డబ్బుల్తో ఆ మాత్రలు తెచ్చుకున్నాను..... వెంకట్రావు ముఖం అందరిముందు పాలిపోసాగింది. అతనికి ఏం చేయాలో తెలియటంలేదు.

"ఏమిటే....నీయిష్టం వచ్చినట్టు నలుగురిలో వాగుతున్నావ్" అని చప్పన ఆమె మీదకు దూకబోయాడు. నేను అతడిని పక్కకిలాగి "ఇదుగో.....నీయిష్టం వచ్చినట్టు ఆమెను కొట్టావంటే మా అందరి చేతుల్లో దెబ్బలు తినాల్సివస్తుంది." అన్నాను కోపంగా.

"నాతల్లి నాయిష్టం. నువ్వెవడివి" అన్నారు వెంకట్రావు.

"నీతల్లయినా, ఇంకెవరయినా నీయిష్టం సాగదు... మర్యాదగా ఉండటం నేర్చుకో..." చెప్పాను వాడితో. వెంకట్రావును ఇప్పను వాడనే పిలవాలనిపిస్తుంది.

"చూసారా బాబూ!....వీడు ఎలా నామీదకు దూకుతున్నాడో.....ఒకసారి నాకు బజారులో కన్పించాడు. ఆప్యాయంగా పలకరిస్తాడేమోనని ఆశపడ్డాను. వీడుమాత్రం 'ఆఇల్లు నీకు వస్తుందనుకుంటున్నావా. అది నాన్నది. భార్యవైన నీకు అందులో అడుగు కూడా రాదు.' అన్నాడు. ఈ ప్రభుత్వాలు మాలాంటి ఆడోళ్ళకి అలాంటి హక్కులన్నా ఇస్తే వీడిలాంటోళ్ళు ఆప్యాయంగా చూస్తారేమోనని పించింది. నా భర్త ఇంట్లో నాకు స్థానం లేకపోవడం ఏమిటా అని ఆశ్చర్యపోయాను.

ఇప్పడు నేను ఆఖరికి పాచిపనులు చేసుకోలేకపోతున్నాను. బట్టలు ఉతికి, అంట్లు తోమటం కష్టమయిపోతోంది. ఏడాదిక్రితం మాధవయ్య గారికి జ్వరం వస్తే నేనే ఆయనకి సేవచేశాను. ఆయనకి ఎవరూలేరు. ఏ కష్టమొచ్చినా ఎంతో బాధపడుతున్నాడు. నాకు కొడుకు వున్నాలేనట్టేనని తెలుసుకున్న ఆయన, 'మనం పెళ్ళి చేసుకుందాం' అన్నారు. నేనందుకు ఒప్పకోలేదు. 'మనం ఏమిటీ? పెళ్ళి ఏమిటీ?' అన్నాను.

అందుకాయన నవ్వి నారాయణమ్మా! నాకు నలతగా వుంటే నువ్వే సాయం చేస్తున్నావు. నీకు బాగోలేకపోయినా నేనే చేస్తాను. మనిద్దరం ఒకరికి ఒకరం సహాయంగా ఉంటున్నాం. పెళ్ళి చేసుకుందామంటుంది ఎందుకంటే-రేపు నేను చచ్చిపోయినా నాభార్యగా నీకు ఫించను వస్తుంది. నువ్వు బ్రతికినంతకాలం ఆర్థికంగా దిగులుండదు. అన్నారు. కొడుకు వుండీ అనాధనైన నాకు మాధవయ్యగారు దేవుడిలా కనిపించారు. అందుకే ఆయన్ని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను. నాకొడుకు అంటున్నట్టు 'సంసారసుఖం' కోసం కాదు. మాపెళ్ళి జరుగుతోంది. ఏదో నేను చట్టబద్ధంగా ఆయన భార్య నవటానికే..... అని హృదయ విదారకంగా ఏడవసాగింది.

"ఎందుకే నాపరువు తీస్తావు, ఇలాంటి నీచమైన పనులు చేసి. రేపు బజారులో నలుగురు నన్ను చూసి నవ్వుతుంటే తలెత్తుకు ఎలా తిరిగేది? చెట్టంత నేను ఉన్నాను. ఇకనుండి నిన్ను చూస్తానంటున్నాగా....ఇంటికి వెళ్దాంరా".... నారాయణమ్మకు సౌమ్యంగా చెప్పాడు వెంకట్రావు.

"ఈ తల్లి ఇన్నాళ్ళూ ఏమయిందిరా.... చెట్టంత ఎదిగిన కొడుకు ఉన్నాడంటున్నావు. చెట్టంత ఎదిగినా ఏం ఉపయోగం వుంది. నాకు నీడను ఇవ్వలేకపోయావు. ఈరోజు ఎవరినో పెళ్ళి చేసుకుంటుందని వినగానే నీపరువు ఎక్కడికి పోతుందో అని బెంబేలెత్తిపోతున్నావు. ఈ తల్లే మాత్రలకు ఊర్లో వారి దగ్గర అడుకున్నా నీకేం అనిపించదు.

నీ ఇంటికి వచ్చినా నాలుగురోజులు బావుంటావు. తర్వాత ఇదివరకటిలాగే నన్ను పురుగును చూసినట్టు చూస్తావు. నేను రానంటే రాను. ఇవాళే మాధవయ్య గారితో పెళ్ళి జరిగి తీరుతుంది. చెప్పింది ధైర్యంగా నారాయణమ్మ.

వెంకట్రావు గాడికి ఏం చెప్పాలో తెలియక మౌనంగా నిలబడి ఉన్నాడు.

"విన్నావుగా ఆవిడధాడు ఇక నువ్వు వెళ్ళొచ్చు." చెప్పాను వాడితో నేను.

ఎంతో ఘోరమైన అవమానం జరిగినట్టుగా తలవంచుకొని చరచరా వెళ్ళిపోయాడు వెంకట్రావు. గుంపులోని జనమంతా క్రమక్రమంగా వింతగా ఈ విషయం చెప్పకుంటూ వెళ్ళసాగారు.

నారాయణమ్మ నన్నుచూసి "బాబూ!.... నేను చేస్తుంది తప్పా? " అని భోరున ఏడవసాగింది.

ఏడవద్దమ్మా! వాడు అసలు నీకొడుకే కాదు నువ్వు చేస్తుంది ఎంత మాత్రం తప్ప కానేకాదు. మీ ఇద్దరి పరిస్థితులే మిమ్మల్ని కలిపాయి. అని ఆమెను అనునయించాను. ఆవిడ వయస్సులో అంత పెద్దది అయినా, ఇందాకటి గొడవకు బాగా కృంగి పోవటం నాకు వింతగా తోచింది. నావంతు కృషిగా ఆమెకు ధైర్యం చెప్పాను.

ఉదయం నారూమ్‌లోనే అన్నం తిన్నది. నేను ఆఫీసుకు శలవు పెట్టాను. ఒకవేళ నారాయణమ్మ ఒంటరిగా ఉన్నప్పడు వెంకటావుగాడు ఆమెను ఏమైనా చేస్తాడేమోననే ఉద్దేశ్యంతో.

"ఇవాళ సాయంత్రం రిజిష్టర్ ఆఫీసులో పెళ్ళి చేసుకుందామన్నారు మాధవయ్య గారు. రాత్రి తన స్నేహితులను పిలుచుకొస్తానని ఊరు వెళ్ళిన మనిషి ఇంతవరకూ రాలేదు" అన్నది నారాయణమ్మ.

"బస్సులు అందక ఆలస్యం అయివుంటుందమ్మ. తప్పకుండా వస్తారులే" అని చెప్పాను నేను.

అన్నం తినగానే ఆమె అలసటగా వుండటం వలన నిద్రపోయింది. మధ్యాహ్నం మాధవయ్యగారు ఊరు నుండి వచ్చారు. ఉదయం జరిగిన గొడవంతా వివరించి చెప్పిందనుకుంట నారాయణమ్మ. ఆయన నన్ను "బాబూ! మేము రేపటి నుంచి వేరే ఊరులో ఉంటే బావుంటుందేమో. వీళ్ళ అబ్బాయి కోపంలో మమ్మల్ని ఏమైనా చెయ్యొచ్చు" సందేహంగా అన్నారు.

"మీరు ఆ భయం పెట్టుకోకండి మీప్రాణానికి మాప్రాణం మీరు ఇక్కడే వుండండి. మీరేం తప్ప చేయటం లేదు ఇక్కడినుండి పోవడానికి. అతడు సిగ్గుపడితే, బాధపడితే పడనీయండి. దానికి మనమేం చేయగలం." చెప్పాను ఆయనతోనేను.

ఆ సాయంత్రం రిజిస్ట్రార్ ఆఫీసులో మాధవయ్య, నారాయణమ్మ గార్ల వివాహం జరిగింది. రాత్రి హోటల్‌లో ఆయన ముగ్గురు మిత్రులు, నేను, వారిద్దరు భోజనాలు చేసాం.

మేము హోటల్‌లో భోజనాలు చేసి వస్తుంటే నారూమ్ ప్రక్కనుండే వ్యక్తి మా దగ్గరకు వచ్చి నాతో "నారాయణమ్మ గారి అబ్బాయి ఈ ఊరి నుంచి వెళ్ళిపోతున్నాడు. లారీలో సామానంతా తీసుకువెళ్తున్నారిప్పడు. వాళ్ళ అత్తగారి ఊర్లో వుంటారంట. తొందరలో ఆ ఊరికే ఉద్యోగం ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటాడంట." అని చెప్పాడు. మా అందరి పెదాలమీద ఆమాటలు వినగానే చిరునవ్వు మెరిసింది.